క్లుప్తంగా

అమ్మవారికి కుంకుమార్చనలు



కుంకుమ పూజల్లో మహిళలు

నరసన్నపేట: స్థానిక వెంకటేశ్వరాలయంలో పుష్య బహుళ అమావాస్య సందర్భంగా మహాలక్ష్మి అమ్మవారికి టీటీడీ, హెచ్‌డీపీపీ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు, పురంధరదాసుల వారి ఆరాధనోత్సవాలు, లలిత సహస్రనామ స్తోత్ర పారాయణ కార్యక్రమాలు శుక్రవారం చేపట్టారు. అధికసంఖ్యలో మహిళలు పూజల్లో పాల్గొన్నారు. మహిళలచే ఆలయ అర్చకులు కృష్ణామాచార్యులు పూజలు చేయించారు. కార్యక్రమంలో హరే శ్రీనివాస భక్త బృందం ప్రతినిధి వారణాశి సంతోషి పాల్గొన్నారు.

బదిలీ ఎంపీడీవోకు సత్కారం



మురళీమోహన్‌కుమార్‌ను సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు

సరుబుజ్జిలి: విధినిర్వహణలో అంకితభావంతో పనిచేసిన ఉద్యోగులకు సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందని మండల ప్రత్యేకాహ్వానితుడు కిల్లి వెంకటగోపాల సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యుడు సురవరపు నాగేశ్వరరావు అన్నారు. ఎంపీడీవోగా పని చేస్తూ అనకాపల్లి బదిలీపై వెళ్లిన పీవీ మురళీమోహన్‌కుమార్‌ను మండలపరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది శుక్రవారం ఘనంగా సన్మానించారు. వైస్ ఎంపీపీలు జీవీ శివానంద మూర్తి, అనిల్‌కుమార్, కొత్తకోట పీఏసీఎస్ చైర్మన్ కొవిలాపు చంద్రశేఖర్, తహసీల్దార్ రమేష్‌కుమార్, నూతన ఎంపీడీవో రత్నం, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మృతుల ఓట్లను తొలగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహనరావు

సారవకోట: ఓటర్ల జాబితాల నుంచి శాశ్వత వలసదారులు, మృతి చెందిన వారి పేర్లను తొలగించాలని ఎన్నికల అధికారి రామ్మోహనరావు సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో బీఎల్‌వోలు, సెక్టార్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. రానున్న సాధారణ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతిఒక్కరూ బాధ్యతగా పనిచేయాలన్నారు. వలస వెళ్లిన ఓటర్లను వారి అనుమతి మేరకు తొలగించాలన్నారు. తహసీల్దార్ భాగ్యవతి, డీటీ మధుబాబు, వ్యవసాయాధికారి కేసీహెచ్ వెంకటరావు ఉన్నారు.

విద్యార్థులు నైతిక విలువలతో మెలగాలి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

కొత్తూరు: విద్యార్థులు నైతిక విలువతో నడవాలని స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయుడు ఎద్దు గోపాల దాసు నాయుడు అన్నారు. పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభ హెచ్‌ఎం ఎ.గోవిందరావు అధ్యతన శుక్రవారం జరిగింది. ఎంఈవోలు గోవిందరావు, శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువులను కలిగిఉన్నప్పుడే నిత్యజీవితంలో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారన్నారు. పరీక్షల్లో శత. శాతం ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. పిల్లలు ఆటపాటలతో సందడి చేశారు. మెట్టూరు జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంతో పాటు పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు డీఎల్ నరసింహం, కేశవరావు, సింహాచలం పాల్గొన్నారు.

ఆలయాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

- పాతపట్నం సీఐ సాయి



మాట్లాడుతున్న సీఐ సాయి


పాతపట్నం: దేవాలయాల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని పాతపట్నం సీఐ నల్లి సాయి అన్నారు. పాతపట్నం పోలీస్ స్టేషన్‌లో దేవాలయాల అర్చకులు, ధర్మకర్తలతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఇటీవల ఆలయాల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నందున బంగారం, వెండి, పెద్ద మొత్తంలో నగదు ఉంచకుండా చూడాలన్నారు. పూజలు నిర్వహించే సమయంలో మాత్రమే ఆభరణాలు ఉంచి, అనంతరం సురక్షితమైన ప్రదేశంలో భద్రపర్చాలని సూచించారు. ఏఎస్‌ఐ టి.శ్రీనివాసరావు, నీలమణిదుర్గ ఆలయ గుమస్తా సుదర్శనరావు, ధర్మకర్తలు ప్రహల్లాద పుల్లాయ్, పూజారులు తేజ, రాజేష్, లక్ష్మీనారాయణ ఉన్నారు.

బడిరూపం మారింది..



జలుమూరు మండలం నగిరికటకం పాఠశాల

- 'నాడు–నేడు' పాఠశాలలకు మహర్దశ
- పిల్లలు, తల్లిదండ్రులు ఆనందం



నరసన్నపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సుపరిపాలనలో నరసన్నపేట నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయి. 2019 సంవత్సరానికి ముందు పాఠశాలలు అధ్వానంగా ఉండేవి. కనీస సౌకర్యాల్లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మహర్దశ పట్టింది. 'నాడు–నేడు' పథకం ద్వారా లక్షలాది రూపాయలు ఖర్చు చేసి పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించారు. సీఎం జగన్ పేద విద్యార్థులకు ఆంగ్ల మాధ్యంలో విద్యను అందించేందుకు వీలుగా పాఠశాలల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో సర్కార్ బడులు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా కనిపిస్తున్నాయి. డిజిటల్ బోర్డులు, అహ్లాదకరంగా తరగతి గదులు, ఆకట్టుకుంటున్న బెంచీలు, మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ సౌకర్యం, పిల్లలకు నాణ్యమైన భోజనం లభిస్తుండడంతో విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

నరసన్నపేట నియోజకవర్గంలో పాఠశాలల అభివృద్ధి ఇలా..

మండలం	పాఠశాలల సంఖ్య	అభివృద్ధి చెందిన పాఠశాలలు	వెచ్చించిన ఖర్చు (రూ. కోట్లలో)	విద్యార్థులు
నరసన్నపేట	83	69	22.90	5,319
సారవకోట	79	45	10. 42	4,753
పోలాకి	97	63	11.50	4,826
జలుమూరు	83	59	21.77	4,171



కొత్త బెంచీలపై పోలాకి మండలం ఈదులవలస పాఠశాల విద్యార్థులు



ఆకర్షణీయంగా ఉన్న నరసన్నపేట మండలం దేశవానిపేట పాఠశాల భవనం

పాఠశాలలు బాగున్నాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన రెడ్డి కృషితో పాఠశాలలు బాగుపడ్డాయి. సత్యవరం స్కూలే దీనికి నిదర్శనం. ఐదేళ్ల క్రితానికీ.. ప్రస్తుతానికి పొంతన లేదు. సదుపాయాలన్నీ మెరుగుపడ్డాయి. దీనికి తోడు పిల్లలకు అమ్మఒడి డబ్బులతోపాటు వారికి అవసరమైన పుస్తకాలు, ఇతర సామాగ్రిని ఉచితంగా ఇస్తున్నారు. నాణ్యమైన విద్య అందుతుంది. ఉపాధ్యాయులు కూడా బాధ్యతగా పనిచేస్తున్నారు.

–ఎస్.బాలరాజు, స్కూల్ కమిటీ చైర్మన్, సత్యవరం

కళ్లెదుటే రూపు రేఖలు మారాయి



నేను ఉర్లాం స్కూల్లో ఆరో తరగతిలో నాలుగేళ్ల క్రితం చేరాను. అప్పటికి స్కూల్ సాదాసీదాగానే ఉండేది. ఇప్పుడు చూస్తే పాఠశాల రూపురేఖలు మారిపోయి ముచ్చటేస్తుంది. కళ్లెదుటే స్కూల్ అభివృద్ధి చెందింది. పుస్తకాలు, యూనిఫాం, బూట్లు, నోట్‌బుక్స్ సమయానికి అందుతున్నాయి. మధ్యాహ్నం భోజనం ఇంటి దగ్గరకంటే చాలా బాగుంది.

–ఎస్.గౌతమి, టెన్త్ క్లాస్, ఉర్లాం

విద్యా బోధన బాగుంది



మాది వ్యవసాయ కుటుంబం. ఇప్పుడు ఇంగ్లిష్‌లో చదువుకుంటున్నా. చాలా ఆనందంగా ఉంది. ఉపాధ్యాయులు విద్యా బోధనను చాలా బాగా చేస్తున్నారు. నాలుగేళ్ల క్రితానికీ.. ప్రస్తుతానికి మా పాఠశాల ఎంతో అభివృద్ధి చెందింది. మౌలిక వసతులు బాగా మెరుగు పడ్డాయి. అమ్మ ఒడి వస్తుంది.

– శిమ్మ పూజిత, టెన్త్, గట్లపాడు

ఎన్నికలకు సిద్ధంకండి



సమావేశంలో పాల్గొన్న పార్టీ శ్రేణులు

- వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే కృష్ణదాస్ పిలుపు

పోలాకి: క్షేత్రస్థాయిలో ఎన్నికలకు సిద్ధం కావాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మబగాంలోని తన క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గం ముఖ్యనాయకులు, కార్యకర్తలతో శుక్రవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత కోవిడ్ విపత్కర పరిస్థితులను సైతం ఎదుర్కొని ఎలా ముందుకెళ్లాలో వివరించారు. మండలాల వారీగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, ప్రాధాన్యతాక్రమంలో ఇంకా చేపట్టాల్సిన పనులపై చర్చించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో విపక్షాలకు ఎక్కడికక్కడ కౌంటర్లు ఇవ్వాలని, లేకపోతే తప్పుడు ప్రచారాలు ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీకి నష్టం కలిగించే అవకాశాలు ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా అవకాశవాద రాజకీయాలు చేసే వారికి దూరంగా ఉండాని, పార్టీ కష్టకాలంలో ఉన్నపుడు అండగా ఉన్న ప్రతిఒక్కరికీ న్యాయం చేసే ప్రయత్నం చేశామన్నారు. నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, వివిధ విభాగాల అధ్యక్షులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పదో తరగతే కీలకం



ఉపాధ్యాయులకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

ఆమదాలవలస: విద్యార్థి భవిష్యత్‌ను నిర్దేశించేది పదో తరగతిలో వచ్చే మార్కులే కీలకమని ఎంఈవో జి.రాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు బి.రామకృష్ణ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన ఫేర్‌వెల్ ఫంక్షన్, పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా పిల్లలు మెలగాలన్నారు. పరీక్షల సమయంలో కష్టంగా కాకుండా.. ఇష్టపడి చదవాలని సూచించారు. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ ఉత్తమ మార్కులు పొందేలా ప్రణాళికతో చదవాలన్నారు. ఈ సందర్భంగా గత ఏడాది సాధారణ సెలవులు మిగిలించిన ఉపాధ్యాయులను సత్కరించారు. అలాగే ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికైన తొమ్మిది మంది విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు దుంపల శ్యామలరావు, జె.కె.వెంకటేశ్వరరావు, సిల్లా మల్లికార్జునరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలల్లో నాణ్యమైన బోధన

- ఓపెన్ డే ప్రోగ్రాంలో ప్రిన్సిపాల్ లత



విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లత

నరసన్నపేట: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో నాణ్యమైన విద్యా బోధన చేస్తున్నామని, మారుతున్న విధానాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చి దిద్దుతున్నామని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. ఉన్నత విద్యా కమిషనర్ ఆదేశాల మేరకు కళాశాలల్లో సౌకర్యాలు, అందుతున్న నాణ్యమైన విద్యా బోధన, అకడమిక్ చర్యలను, నూతన కోర్సులపై విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు వీలుగా శుక్రవారం పరిసరాల జూనియర్ కళాశాల విద్యార్థులకు ఓపెన్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థులకు కళాశాలల్లో గదులు, లైబ్రెరీ, జిమ్, కంప్యూటర్ రూంతో పాటు ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను చూపించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. కళాశాలల్లో అమలు చేస్తున్న ప్రొగ్రాం, కోర్సులను వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్‌తో పాటు అధ్యాపకులు రవికుమార్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి పెద్దపీట



హిరమండలం: రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

హిరమండలం: రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. రుగడ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష–2 కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వైద్య నిపుణులతో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఉచితంగా రోగ నిర్ధారణ పరీక్షలతో పాటు మందులు అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో స్వరూపరాణి, ఈవోపీఆర్డీ పి.నాగమణి, వైద్యాధికారి యశ్వంత్ సాయి గీత, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మదనాపురంలో..

బూర్జ: జగనన్న ఆరోగ్యసురక్ష ప్రజలకు వరమని జెడ్పీటీసీ సభ్యుడు బెజ్జిపురపు రామారావు అన్నారు. మదనాపురంలో బూర్జ పీహెచ్‌సీ వైద్యులు జి.రాజశేఖర్, ఐ.పావని ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి రోగులకు పరీక్షలు చేసి మందులు అందించారు. మండల ప్రత్యేక ఆహ్వానితుడు కర్నేన నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ డి.వి.నాయుడు, నాయకులు వి.గోవిందరావు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, స్పెషలిస్టు వైద్యులు, సీహెచ్‌వో కె.అప్పలస్వామి, హెల్త్ సూపర్‌వైజర్లు లఖినాన సరోజిని, టి.తేజారావు, ఎమ్ఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, పీహెచ్‌సీ, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు ఉన్నారు.

కొత్తూరులో..

కొత్తూరు: కొత్తూరు గ్రామ సచివాలయం–1 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు శిబిరాన్ని సందర్శించారు. వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 348 మందికి వైద్య సేవలు అందించినట్టు డాక్టర్ రాంబాబు చెప్పారు. వైద్య నిపుణులు, ఈవోలు కృష్ణారావు బుజ్జిబాబు, సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు, వలంటీర్‌లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



బూర్జ: రోగులకు రక్తపరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది



కొత్తూరు: రోగులకు మందులు పంపిణీ చేస్తున్న సిబ్బంది



పాతపట్నం: రోగిని పరీక్షిస్తున్న వైద్యురాలు

పాతపట్నం: బూరగాం గ్రామ సచివాలయం వద్ద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బైదలాపురం వైద్యుడు జి.సదాశివ 251మంది రోగులకు వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రహాల్లాధ పుల్లాయ్, సవిరిగాన శ్రీనివాసరావు, ధర్మాన కుమార్‌రెడ్డి, వైద్యురాలు కె.సత్యవేణి, రిమ్స్ వైద్యులు పద్మప్రియ, రెష్మా, కంటి వైద్యురాలు రత్నప్రియ, రామారావు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్వారీ వద్దంటూ గిరిజనుల వినతి



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న మెట్టుపేట గిరిజనులు

పాతపట్నం: గంగువాడ పంచాయతీ మెట్టుపేట గ్రామానికి ఆనుకుని ఉన్న సారవకోట మండలం పెద్దలంబ గ్రామ రెవెన్యూ పరిధిలోని కొండపై క్వారీ ఏర్పాటు చేయవద్దని మెట్టుపేట గిరిజనులు కోరారు. ఈ మేరకు డీఆర్వో రామ్మోహనరావుకు శుక్రవారం వినతిపత్రం అందించారు. పెద్ద మల్లిపురం గ్రామ సమీపంలో సారవకోట మండలం పెద్దలంబ గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్–7లో ఉన్న కొండకు ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో శుక్రవారం మెస్సర్స్ యుక్తి, ఆర్.వి.ఎస్.మైన్స్, ఎం.ఎస్.యుక్తి మైన్స్‌లు రెండు క్వారీలకు పర్యావరణ ప్రజా అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ప్రజా అభిప్రాయ సేకరణలో ఆరు నెలలుగా ఒక కంపెనీకి చెందిన క్వారీ నడుపుతున్నారని, మెట్టుపేట ప్రభుత్వ పాఠశాలకు క్వారీలో పేలుళ్లకు రాళ్లు వస్తున్నాయని గ్రామస్తులు తెలిపారు. అలాగే క్వారీ రాళ్లను లారీలతో తరలిస్తుండడంతో గంగువాడ చెరువు గట్టు రహదా పాడైపోయిందని, గంగువాడ, పెద్దమల్లిపురం, చిన్నమల్లిపురం రహదారి వెంట వెళ్లలేకపోతున్నామన్నారు. సారవకోట మండలం పెద్దలంబ రెవెన్యూ అయినప్పటికీ, క్వారీకు రహదారితో పాటు మెట్టుపేట, పెద్దమల్లిపురం పరిధిలో ఉందన్నారు. సమావేశంలో ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రామారావునాయుడు, మైన్స్ అధికారులు, పెద్దలంబ, మెట్టుపేట, గంగువాడ, పెద్దమల్లిపురం, చిన్నమల్లిపురం గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నరసన్నపేట: నరసన్నపేట మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహిస్తున్నట్టు ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణారావు తెలిపారు. ఎంపీపీ ఆరంగి మురళీ అధ్యక్షతన జరగనున్న సమావేశంలో ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని.. అధికారులు, సభ్యులు హాజరు కావాలని కోరారు.

హిరమండలం: స్థానిక మండల పరిషత్ కార్యలయ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 11 గంటలకు హిరమండలం మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ తూలుగు మేనక అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో డీడీ స్వరూపారాణి తెలిపారు. సభ్యులంతా విధిగా హాజరు కోవాలని విజ్ఞప్తి చేశారు.

మాజీ ప్రధాని పీవీకి భారతరత్నపై హర్షం

సరుబుజ్జిలి: మాజీ ప్రధానమంత్రి దివంగత పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించడంపై అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.వి. రాజారావు, ఎం. రామకృష్ణారావు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. స్థితప్రజ్ఞుడు, బహుభాషాకోవిదుడు, ఆర్థికవేత్తగానే కాకుండా తెలుగుజాతి ఖ్యాతిని పెంచిన మహనీయుడని కొనియాడారు.

విద్యార్థులు పోటీతత్వం అలవర్చుకోవాలి



కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తదితరులు

ఎల్.ఎన్.పేట: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవాటు చేసుకోవాలని లక్ష్మీనర్సుపేట ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు అన్నారు. సీనియర్ ఇంటర్ విద్యార్థుల వీడ్కోల్ సభను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చదువులో పోటీ పడే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను చేరుకుంటారని అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన డాన్స్ కార్యక్రమం ఆకట్టుకుంది. లయన్స్‌క్లబ్ వైస్ ప్రెసిడెంట్, దివ్యాంగు ఉద్యోగులు రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంకె మిశ్రో, కాలేజీ అధ్యాపకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ



సుధాకర్‌ను అభినందిస్తున్న సిబ్బంది

హిరమండలం: హిరమండలం మండల నూతన తహసీల్దార్‌గా బి.సుధాకర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన అనకాపల్లి జిల్లా కోటకోట నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఉప తహసీల్దార్ వెంకటమరణతో పాటు సిబ్బంది సుధాకర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



పాతపట్నం: పెద్దసీది జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినితో మాత్రమింగిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పిల్లల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తుందని వక్తలు అన్నారు. డీవార్మింగ్ డే సందర్భంగా నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల్లోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నులిపురుగు నివారణ కోసం ఆల్బెండజోల్ మాత్రలను శుక్రవారం పంపిణీ చేశారు. ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నరసన్నపేట: నడగాం పాఠశాలలో పిల్లలకు మాత్రలు వేస్తున్న వైద్యాధికారి సుజాత



బూర్జ: కొల్లివలస బి.ఆర్.అంబేద్కర్ గురుకులం విద్యాలయంలో ఆల్బెండజోల్ మాత్రలు వేయిస్తున్న గుత్తావల్లి పీహెచ్‌సీ వైద్యురాలు రమ్య

సంక్షిప్తంగా..

అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి



విత్తనాలు అందజేస్తున్న దృశ్యం

కొత్తూరు: నిరక్షరాసులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని స్ఫూర్తి సేవా సదన్ జిల్లా కోఆర్డినేటర్ ఎం.భీష్మ అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆరోగ్యవంతులుగా ఉంటామన్నారు. కొత్తూరులోని ఓ చర్చి ఆవరణలో గురు, శుక్రవారాల్లో జరిగిన వయోజన విద్య, పరిసరాల పరిరక్షణతో ఆరోగ్యం అనే అంశంపై వయోజన విద్య అభ్యాసకులు, బోధకులకు నిర్వహించిన అవగాహన సదస్సు శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా బోధకులకుఆరు రకాల కూరగాయల విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వయోజన విద్య కొత్తూరు, ఎల్.ఎన్.పేట మండలాల సమన్వయకర్తలు బొత్స జయకుమారి, పైడి మోజేష్‌రాజ్ పాల్గొన్నారు.

నడిరోడ్డుపై విద్యార్థుల కొట్లాట!



ఘర్షణ పడుతున్న కళాశాల విద్యార్థులు

సరుబుజ్జిలి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఫేర్‌వెల్ ఫంక్షన్ పూర్తయిన అనంతరం విద్యార్థులు రహదారిపై కేకలు వేసుకొని గ్రూపులుగా విడిపోయి కొట్లాడుకున్నారు. రహదారిపై గలాటా చోటు చేసుకోవడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఎస్సై నిహార్ తన సిబ్బందితో వచ్చి విద్యార్థులను చెదరగొట్టారు. భవిష్యత్‌లో ఇలా జరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఇంటర్ విద్యార్థులు వివిధ కారణాలతో రెండు గ్రూపులుగా విడిపోయి నాలుగు రోజులుగా తరగతులు పూర్తయిన తరువాత గొడవలు పడుతున్నట్లు సమాచారం.

విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

ఆమదాలవలస: మంచి భవిష్యత్ కోరుకునే విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లకూడదని ఆమదాలవలస ఎస్ఈబీ సీఐ కె.రాజారావు సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ అధికారి జె.రవిబాబు ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నివారణపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. మాదకద్రవ్యాలకు అలవాటుపడితే జీవితం నాశనం అవుతోందన్నారు. కార్యక్రమంలో ఎస్ఈబీ ఎస్ఐ వి.ఎల్.కరుణలత, హెచ్‌సీ శ్రీరామమూర్తి, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎస్.వి.ఎల్.నారాయణరావు ఉన్నారు.

చికిత్స పొందుతూ పెయింటర్ మృతి

ఆమదాలవలస: చింతాడ గ్రామానికి చెందిన తోట శ్రీనివాసరావు (46)అనే పెయింటర్ ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి మృతి చెందినట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీనివాసరావు ఈనెల 4వ తేదీన పట్టణంలోని పూజారిపేటకు చెందిన తోట షర్మిల ఇంటి మేడపైన పెయింటింగ్ వర్క్ చేస్తూ సాయంత్రం ఐదు గంటల సమయంలో ప్రమాదవశాత్తు జారిపడి తీవ్ర గాయాలయ్యారు. క్షతగాత్రుడిని రాగోలు జెమ్స్ హాస్పిటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. మృతుని భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మృతునికి ఒక కుమారుడు ఉన్నాడు.